
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

వరంగల్ ఉమ్మడి జిల్లా

శుక్రవారం 15 నవంబరు 2024



వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు



హనుమకొండలో దీపాలు, ఉసిరి కొనుగోలు చేస్తున్న మహిళలు

కార్తీక శోభితం..

నిండుపౌర్ణమి వేళ అభిషేకాలు, దీపోత్సవాలు

- నేటి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు, ఆలయాలు
- వేయిస్తంభాల గుడిలో లక్షదీపార్చన
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ



ఉత్సవాలకు సిద్ధమైన కొడవటూరు సిద్దులగుట్ట

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్/ జనగామ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన.. పవిత్ర కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా భక్తులు ఉసిరిక స్నానాలు చేయడం, బ్రహ్మీ ముహూర్తంలో తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వం ప్రత్యేకత. దీపావళి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పూజలు పౌర్ణమి రోజున మరింత విశిష్టంగా జరుగుతాయి. దీనికి తోడు కార్తీక పౌర్ణమి రోజున శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది. కార్తీక పూజల్లో ముఖ్యమైన ఉసిరి కొమ్మలు, కాయలతో పాటు పూలు, వివిధ రకాల పండ్ల అమ్మకాలతో నగరంలో సందడి కనిపించింది. హనుమకొండ, వరంగల్ చౌరస్తాలతో పాటు అనేక ప్రధాన కూడళ్లలో రద్దీ కనిపించింది. అలాగే జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పలు ఆలయాలను, ప్రసిద్ధ శైవ క్షేత్రాలను ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేలా, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

వేయిస్తంభాల ఆలయంలో ఇలా..

వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఉదయం 5గంట నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే లక్షదీపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహా పలువురు

మిగతా 6వ పేజీలో...

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పర్వదినం సందర్భంగా గురువారం వైకుంఠ చతుర్దశి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిమాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం, శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిరవహించారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గు లు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపా దానం అందజేశారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లొంగిపోయిన మావోయిస్టుకు చెక్కును అందజేస్తున్న సీపీ

మహిళా మావోయిస్టు లొంగుబాటు

- అనారోగ్యంతో లొంగిపోయిన మంజుల అలియాస్ నిర్మల
- రూ.20 లక్షల రివార్డు చెక్కు అందజేసిన సీపీ

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ మహిళా సభ్యురాలు కొడి మంజుల అలియాస్ నిర్మల గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన మంజుల తండ్రి పీపుల్స్‌వార్‌కు సానుభూతిపరుడిగా పనిచేయడంతో పాటు ఆమె అన్న కుమారస్వామి అలియాస్ ఆనంద్, దగ్గరి బంధువు కోడి వెంకన్న అలియాస్ గోపన్న నర్సంపేట దళ కమాండర్‌గా పని చేసి ఎదురు కాల్పుల్లో మరణించారు. వారి ప్రభావంతో పాటు పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితమైన మంజుల.. టెన్త్ మధ్యలో చదువు ఆపేసి 1994లో పీపుల్స్‌వార్ గ్రూపు నర్సంపేట దళంలో చేరింది. ఆ తర్వాత చేర్యాల దళంలో పని చేసింది. 1999లో నర్సంపేట దళకమాండర్ పెరం బుచ్చయ్యను వివాహం చేసుకుంది. 2000లో బుచ్చయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం 2001లో మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ సారథ్యంలో ప్రెస్ టీం ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో యేడాది పనిచేసి 2002లో మహదేవపూర్ డిప్యూటీ దళ కమాండర్‌గా పనిచేస్తున్న క్రమంలో డివిజనల్ కమిటీ మెంబర్ కుకటి వెంకట్ అలియాస్ రమేశ్‌ను వివాహం చేసుకుంది. వైద్యం కోసం మరో మహిళా దళ సభ్యురాలితో భూపాలపల్లికి వచ్చి 2002 డిసెంబర్ 24 పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది. 2004లో జైలు నుంచి విడుదలై తిరిగి మావోయిస్టులతో సంబంధాలు కొనసాగిస్తూ మహదేవపూర్ దళసభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2005లో మాహదేవపూర్, చేర్యాల, మహారాష్ట్ర, సిరోంచ, డిప్యూటీ కమాండర్‌గా పనిచేసింది. 2007 నుంచి మణుగూర్ దళ కమాండర్‌తో పాటు పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో ఏరియా కార్యదర్శిగా, వైద్య బృందానికి బాధ్యురాలిగా 2011 వరకు పనిచేసింది. అ తర్వాత 2021 వరకు బస్తర్‌లో వివిధ క్యాడర్‌లో పనిచేసి 2022లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలుగా మంజుల బాధ్యతలు స్వీకరించింది. 2013లో దర్బా డివిజన్‌లో జీరంఘాటి ప్రాంతంలో 27 మంది పోలీసులను హత్య చేసిన ఘటనతో పాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులుపై జరిపిన కాల్పుల్లో మంజుల నిందితురాలిగా ఉంది.

కాగా, అనారోగ్య సమస్యలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసం పట్ల ఆకర్షితులై మంజుల లొంగిపోయినట్లు సీపీ తెలిపారు. కాగా, ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు చెక్కును అందజేశామన్నారు. తెలంగాణలో నక్సలిజంకు ఎలాంటి ఆదరణ లేదని, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారం గురుకులంలో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ స్కూల్ 10వ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్పీ శబరీశ్ హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా కెరియర్‌గా కూడా ఎంచుకోవచ్చన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం ఆల్ రౌండ్ పర్ఫార్మెన్స్ ట్రోఫీని జాకారం గురుకులం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి అరుణ కుమారి, డీసీవో శ్రీనివాసరావు, భిక్షపతి, జోనల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కాళేశ్వరం జోన్ ప్రిన్సిపాళ్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


జాకారం గురుకులం విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే

మహబూబాబాద్ జిల్లాలో ఆరు రోజుల్లో 1,19,757 కుటుంబాల గణన పూర్తి


కొత్తపేటలో సర్వే చేస్తున్న అధికారులు


గూడూరులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగవంతంగా కొనసాగుతోంది. మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మానుకోటలతో పాటు 18 మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తంగా కలిపి 2,66,603 కుటుంబాలను గుర్తించారు. ఈనెల 14 వరకు 1,19,757 (44.9 శాతం) కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. కాగా, జిల్లాలోని 18 మండలాల పరిధిలో 2,27,758 కుటుంబాలకు గాను 1,01,462 కుటుంబాల సర్వే పూర్తయింది. నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 38,845 కుటంబాలకు గాను 18,295 కుటంబాల సర్వే పూర్తయింది.

ఈ నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటంబ సర్వే ఆరంభం కాగా 8 వరకు సర్వే చేపట్టే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ యాజమాని పేర్లు రాసుకుని ఇంటికి స్టిక్కర్‌ను వేశారు. ఈనెల 9 నుంచిపూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు కులగణన ప్రారంభమైంది. తొలి రెండురోజులు కాస్త నెమ్మదిగా సాగిన సర్వే క్రమక్రమంగా వేగం పుంజుకుంది. ఆరు రోజుల్లో 1,19,757 కటుంబాల సర్వే పూర్తి చేశారంటే సగటున ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 20 వేల కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఈనెల 21 వరకు ఇం టింటి సర్వే కొనసాగించి వివరాలను ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

జిల్లాలో ఈ నెల 14 వరకు సర్వే వివరాలు

మండలం	కుటుంబాలు సర్వే	పూర్తయినవి
బయ్యారం	15414	7277
చిన్నగూడూరు	5347	2840
దంతాలపల్లి	9724	5210
డోర్నకల్	12623	5054
గంగారం	3791	1858
గార్ల	13,228	6713
గూడూరు	18572	8311
ఇనుగుర్తి(కేసముద్రం)	3926	1624
ఇనుగుర్తి (నెల్లికుదురు)	2461	982
కేసముద్రం	18686	9114
కొత్తగూడ	10118	4835
కురవి	16712	5806
మహబూబాబాద్	14142	5839
మరిపెడ	20461	8596
నర్సింహులపేట	9990	4025
నెల్లికుదురు	16829	6576
పెద్దవంగర	10045	5768
సీరోలు (డోర్నకల్)	2190	854
సీరోలు (కురవి)	5511	2090
తొర్రూరు	17988	8090
మునిసిపాలిటీలు		
డోర్నకల్	4171	2232
మహబూబాబాద్	21432	10010
మరిపెడ	5293	2699
తొర్రూరు	7949	3354
మొత్తం	2,66,603	1,19,757

మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే ▸ మహదేవపూర్ పీఎస్ తనిఖీ


పోలీసు సిబ్బంది ఆయుధాలు, సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

మహదేవపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా పెట్టాలని పోలీసు సిబ్బందిని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, వారు ఉపయోగిస్తున్న ఆయుధాలను, సామగ్రిని పరిశీలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, పెండింగ్ కేసులపై సత్వర చర్యలు చేపట్టాలని సీఐ రాంచందర్‌రావు, ఎస్సై పవన్‌కుమార్‌ను ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

'కార్తీక' శోభితం..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. అలాగే హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయం, ములుగు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్తక్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయం, హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీ సీతారామ ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే వరంగల్ నగరంలోని శ్రీ వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి హోమం, అభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేస్తారు.

మహిళలు ఆలయాల్లో వత్తులు కాల్చడంతో పాటు దీపాలు వెలిగించి నైవేద్యం నివేదన చేసి పూజలు చేయనున్నారు. 365 వత్తులు, 1008 వత్తులు, లక్ష వత్తులు కాలుస్తారు. పలు చోట్ల ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో శుక్రవారం ప్రత్యే క పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున అభిషేకం, భక్తుల ముద్ర మాలలకు పూజ అనంతరం అయ్యప్ప భక్తుల మాలాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి అయ్యప్ప మాల వేసుకునే భక్తులకు ఉచితంగా మాలాధారణ చేసి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నట్లు ఆయన వివరించారు.

సోమేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతిని నిర్వహిస్తున్న మూడో దేవస్థానంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో శుక్రవారం అఖండజ్యోతి గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో సల్వాది మోహన్‌బాబు తెలిపారు. అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై 8 అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన ప్రమిదలో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవునెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 5గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఉత్తరకాశి పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై అఖండజ్యోతిని ప్రారంభిస్తారన్నారు. అలాగే జనగామ బాణాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష దీప మహోత్సవం, కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు.

బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దులగుట్ట కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం తెలవారుజాము నుంచే సిద్దేశ్వరుడికి విశిష్ట అభిషేకాలు, అన్నపూజలు, మహారుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించనున్నారు. స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం సిబ్బంది శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలను నియమించామని ఈవో చిందం వంశీ తెలిపారు.

అప్పు తీర్చడం లేదని హత్య

జనగామ జిల్లా ఎల్లారెడ్డిగూడెంలో ఘటన

రఘునాథపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని డబ్బులు తిరిగి ఇవ్వలేదనే కారణంతో అప్పు ఇచ్చిన వ్యక్తి హత్య చేసిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గంపల పరశురా ములు(40)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీమేస్త్రి పనిచేస్తూ, పెళ్లిళ్ల సీజన్‌లో బ్యాండ్ వాయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురైన పరశురాములు భార్య చికిత్స కోసం ఇదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ వద్ద అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని మహేందర్ కొద్దిరోజుల నుంచి కోరుతూ వస్తున్నాడు. ఇదిలా ఉంటే మహేందర్ ఇల్లు కట్టుకోగా పరశురాములు నిర్మాణ పనులు చేపట్టాడు. తీసుకున్న అప్పు ఇంటి పనులతో తీరిందని పరశురాములు, లేదు ఇంకా డబ్బులు రావాలని మహేందర్ ఎవరికివారే చెబుతున్నారు. ఇదే విషయంపై కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. అయితే మహేందర్ నుంచి పరశురాములు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు అప్పు తీసుకుని ఉంటాడని గ్రామస్థులు చెబుతున్నారు. మహేందర్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడని తెలిసింది.

ఫోన్ చేసి పిలిచి.. భార్యా పిల్లల ఎదుటే హత్య..

పరశురాములు ఎల్లారెడ్డిగూడెంలో బుధవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకల్లో అర్ధరాత్రి వరకు పాల్గొన్నాడు. తర్వాత ఇంటికి వెళ్లి పడుకోవడానికి ఉపక్రమిస్తున్న సమయంలో మహేందర్ అతడికి ఫోన్ చేసి గ్రామంలోని బొడ్రాయి వద్దకు రావా లని కోరాడు. అప్పటికే అతిగా మద్యం సేవించిన మహేందర్, పరశురాములు అక్క డికి రాగానే కత్తి(తల్వార్)తో తలపై వేటు వేశాడు. తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడి కక్కడే కుప్పకూలి మృతి చెందాడు. భర్త వెనుకాలే వెళ్లిన పరశురాములు భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ చూస్తుండగానే మహేందర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురై కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమివ్వగా రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ డి.నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ విచారణ చేపట్టారు.

గ్రామంలో విషాదం..


పరశురాములు హత్యకు గురవడంతో ఎల్లారెడ్డిగూడెం విషాదం నెలకొంది. మృతుడి భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె రోదన గ్రామస్థులను కలచివేసింది. హత్యకు పాల్పడిన మహేందర్‌పై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తు కఠినంగా శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, సుధాకర్, కుమార్ పరామర్శించారు.

హత్యకు కారణం ఇదేనా ?

పరశురాములు తన భార్య సంధ్య చికిత్స నిమిత్తం పర్వత హహేందర్ నుంచి రూ.80 వేలు అప్పుగా తీసుకున్నట్లు తెలుస్తుంది. తాపీమేస్త్రీగా పని చేసే పరశు రాములు, మహేందర్‌కు సంబంధించిన కొత్త ఇంటి నిర్మాణం పనులు చేసి అప్పు గా తీసుకున్న డబ్బులు తీర్చినట్లు మృతుడి బంధువులు చెబుతున్నారు. అప్పుగా తీసుకున్న రూ.80 వేలలో సుమారు రూ.50 వేల వరకు మాత్రమే పరశురాములు, అతడి భార్య ఇంటి నిర్మాణ పనులు చేసి అప్పు తీర్చినట్లు తెలుస్తోంది. రూ. 50వేల విలువ గల ఇంటి నిర్మాణ పనులు చేయకుండానే చేసినట్లు చెబుతుండడంతో ఇద్ద రి మధ్య విభేదాలు ఏర్పడినట్లు సమాచారం.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పరశురాములును హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హత్యను ఖండిస్తూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరశురాములు హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, హంతకుడిపై పీడీ యాక్టు నమోదు చేసి, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, జేరిపోతుల సుధాకర్, బొల్ల పల్లి కృష్ణ, గిరిమల్ల రాజు, ప్రభాకర్, రాగల ఉపేందర్, డీ రవి, అబ్బయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


హత్యకు గురైన గంపల పరశురాములు


గంజాయిని దహనం చేస్తున్న ఏఎస్పీ జోగుల చెన్నయ్య

రూ.1.28కోట్ల విలువైన గంజాయి దహనం చేసిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన 1.28 కోట్ల విలువైన గంజాయిని కాకతీయ మెడికల్ ఏజెన్సీ, ఉర్సుగుట్ట హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశాల మేరకు డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సభ్యులు, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు సమక్షంలో 515 కేజీల 720 గ్రాముల గంజాయిని గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 24 కేసుల్లో మొత్తం 515 కేజీల 720 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన గంజాయిని గత కొంత కాలంగా నిల్వ చేసి గురువారం దగ్ధం చేసినట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, పెండ్యాల దేవేందర్, రాజేష్, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తపు వాంతులతో వ్యక్తి మృతి

హత్యగా భావించి భయపడిన ప్రజలు


మృతి చెందిన రవీందర్

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడూరు మండలం రాజన్‌పల్లి కాలనీతండాకు చెందిన ధరావత్ రవీందర్ (27) రక్తం వాంతులు చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం. కూలీ పని చేస్తూ జీవించే రవీందర్ కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లి తిరిగి కేసముద్రం రైల్వేస్టేషన్‌కు గురువారం తెల్లవారుజామున చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ ఆవరణలో రక్తం వాంతులు వస్తుండగా అక్కడి నుంచి బయటకు నడుచుకుంటూ వచ్చి కుర్చొని మరింత రక్తం వాంతి చేసుకొని మృతి చెందాడు. తెల్లవారుజామున రైల్వేస్టేషన్ ఆవరణలో రవీందర్ మృతదేహం ముఖంపై రక్తం ఉండడంతో హత్య జరిగిందని భావించి, మండల కేంద్రంలో కలకలం రేపింది. అనంతరం జరిపిన ప్రాథమిక విచారణలో రవీందర్ మృతిపై స్పష్టత వచ్చింది. ఈ మేరకు మృతిని భార్య అనూష ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు మహబూబాబాద్‌కు తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనా స్థలాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, జీఆర్‌పీ సీఐ పి. సురేందర్ పరిశీలించారు.


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
శుక్రవారం 15 నవంబరు 2024





స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎంపీ, ఎమ్మెల్యే(ఫైల్)

మత్స్యోత్సాహం

- 1.36 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- ఇప్పటికే 1.13కోట్ల చేప పిల్లల సరఫరా
- జిల్లాలో 83.50శాతం పూర్తి
- తుది దశకు చేప పిల్లల పంపిణీ
- ఈసారి లక్ష్యాన్ని సగానికి తగ్గించిన ప్రభుత్వం
- మత్స్యకారుల్లో అసంతృప్తి

జనగామ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. గత నెల 7న జిల్లాలో ప్రారంభమైన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పూర్తికావస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. గత ఏడాది బిల్లులు రాకపోవడంతో ఈ ఏడాది పంపిణీ చేసేందుకు ఫిష్ ఫార్మర్లు(కాంట్రాక్టర్లు) ముందుకు రాలేదు. దీంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్లతో సంప్రదింపులు జరపడంతో ముందుకొచ్చి టెండర్లు వేశారు. జిల్లావ్యాప్తంగా 9 రిజర్వాయర్లు, 723 చెరువులు, కుంటల్లో ఈ ఏడాది 1.36 కోట్ల చేప పిల్లలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. జనగామ జిల్లాలో 169 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 141 పురుషుల సంఘాలు కాగా.. 28 మహిళల సహకార సంఘాలు ఉన్నాయి. 169 సంఘాల్లో 16,868 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. కాగా.. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 1.36 కోట్ల చేప పిల్లలను వదలాలను లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 1.13 కోట్ల చేప పిల్లల పంపిణీని పూర్తి చేశారు. కాగా, లక్ష్యాన్ని 83.50శాతం పూర్తి చేసి జనగామ జిల్లా ప్రస్తుతం రాష్ట్రంలో 6వ స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు.

లక్ష్యం సగానికి కుదింపు

ప్రతి ఏడాదిలా కాకుండా ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ లక్ష్యాన్ని ప్రభుత్వం 50శాతానికి కుదించింది. చెరువుల్లో నీరు లేకపోవడంతో, నిధులు లేమి కారణంగా అధికారులు టార్గెట్ సగానికి కుదించారు. ప్రతీ ఏటా జిల్లాలో 2.72 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వదలాలని లక్ష్యంగా పెట్టుకోగా ఈసారి 1.36 కోట్లకే పరిమితం చేశారు. నిధుల లేమి కారణంగా ప్రభుత్వం గత ఏడాదికి సంబంధించి రావాల్సిన సుమారు రూ.100 కోట్ల బిల్లులను ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇంకా మంజూరు చేయలేదు. దీనికి తోడు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సైతం తక్కువగా కురిసాయి. దీంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగానే ఉంది. గత ఏడాది చెరువులు నిండుగా ఉన్న సమయంలో వంద శాతం చేప పిల్లలను వదిలారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు లేకపోవడంతో అదే వంద శాతం పిల్లలను వేస్తే చేప పిల్లలు బతికే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో లక్ష్యాన్ని సగానికి తగ్గించారు.

మత్స్యకారుల్లో అసంతృప్తి

చేప పిల్లలను గత ఏడాది కంటే సగానికి తగ్గించి ఇవ్వడంతో మత్స్యకారుల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఏటా పూర్తిస్థాయిలో చేప పిల్లలను ఇవ్వగా ఈసారి సగానికి తగ్గించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంటున్నారు. గత ఏడాది పూర్తి స్థాయిలో ఇచ్చిన చేప పిల్లల్లో చాలా వరకు చనిపోయేవని, చివరి వరకు తమకు పెద్దగా గిట్టుబాటు అయ్యేది కాదని వాపోతున్నారు. కాగా.. ఇప్పుడు సగానికిపైగా తగ్గించి ఇవ్వడం వల్ల చివరకు పెద్దగా మిగిలేది ఏమీ ఉండదని అంటున్నారు. పభుత్వం తగ్గించిన మిగతా 50శాతం టార్గెట్‌కు సంబంధించిన అమౌంట్‌ను ప్రభుత్వం తమ ఖాతాల్లో వేయాలని కోరుతున్నారు. దీంతో తాము సొంతంగా చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వేసుకుంటామని చెబుతున్నారు.

నాలుగైదు రోజుల్లో వందశాతం పూర్తి

- రాణాప్రతాప్, జిల్లా మత్స్యశాఖ అధికారి, జనగామ



జిల్లాలో చేప పిల్లల పంపిణీ చివరి దశకు చేరుకుంది. జిల్లాలో ఈ ఏడాది 1.36 కోట్ల చేప పిల్లలను వదలాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటివరకు 1.13 కోట్ల చేప పిల్లల పంపిణీ పూర్తి చేశాం. 83.50 శాతంతో చేప పిల్లల పంపిణీలో జనగామ జిల్లా రాష్ట్రస్థాయిలో 6వ స్థానంలో ఉంది. మరో నాలుగైదు రోజుల్లో పంపిణీ పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం.

23, 24న ప్రత్యేక ఓటరు నమోదు

- కొత్త వారి వివరాల నమోదు, సవరణలకు అవకాశం
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ప్రజా ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 23, 24న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలో గురువారం కలెక్టర్ ప్రత్యేక సారంశ పునశ్చరణ(ఎస్ఎస్ఆర్) 2025 కి సంబంధించిన కీలక నవీకరణలపై వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 23, 24న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ క్యాంపెయిన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్త ఓటరు నమోదు, సవరణలు చేసుకోవచ్చని బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ఓటరు నమోదు క్యాంపెయిన్‌లో 505 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈనెల 23న ముసాయిదా జాబితాను విడుదల చేసి డిసెంబరు 12 వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్ఆర్ సమగ్రమైన ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు జోగు ప్రకాశ్, రావెల రవి, అజయ్‌కుమార్, విజయ్‌బాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీడికల్ కల్యాణోత్సవానికి ఆహ్వానం

లింగాలఘణపురం: లింగాలఘణపురం మండలంలోని సుప్రసిద్ధ జీడికల్ శ్రీరామచంద్రస్వామి కార్తీక మాస బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 20న జరిగే తిరుకల్యాణోత్సవానికి హాజరుకావాలని గురువారం ఈవో చిందం వంశీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానించిన వారిలో జనగామ ఉప్పలమ్మతల్లి దేవస్థానం ఈవో కెకె రాములు, ఏలె మూర్తి ఉన్నారు.

ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

జనగామ కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.కుమారస్వామి అధ్యక్షత జరిగిన వేడుకల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ కలల సాకారం కోసం నిరంతరం పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థుల ఉపన్యాసాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.



మైనారిటీ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న జడ్జి సి.విక్రమ్

గంజాయి తాగుతున్న ఇద్దరి వ్యక్తుల అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

దేవరుప్పుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజుపల్లిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను దేవరుప్పుల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన జోగు అర్జున్, రచ్చ చందు గంజాయి సేవిస్తున్న పక్కా సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి గంజాయితో సహా వారిని ట్టుకొని అదుపులోకి విచారణ జరిపినట్టు తెలిపారు. వారి నుంచి 50గ్రాములు గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్, స్ప్లెండర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో వారిని చూపి ఆయన మాట్లాడుతూ ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, కానిస్టేబుల్ యాఖూబ్ పాల్గొన్నారు.

గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్నాం సార్..

మాజీ మంత్రి దయాకర్‌రావుకు రైతు మొర



దయాకర్‌రావుకు సమస్యను వివరిస్తున్న రైతులు

కొడకండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత్యంతరం లేక ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్నాం సార్ అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం మొండ్రాయి మీదుగా వెళ్తున్న దయాకర్‌రావును స్థానిక రైతులు ఆపి తమ బాధలను పంచుకున్నారు. రైతులు మాట్లాడుతూ రూ.500 బోనస్ సంగతి దేవుడెరుగు, కనీసం మద్దత ధర ప్రభుత్వం ఇవ్వడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి పొలాల్లో ఉన్న కల్లాల దగ్గరికి వెళ్లి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పండిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేదాకా వదిలే ప్రసక్తే లేదన్నారు. మంత్రితో మాట్లాడిన రైతులలో అనుముల అంజయ్య, పెరుమాండ్ల పరుశురాములు, నలమాసు మల్లయ్య తదితరులు ఉన్నారు.

- కొడకండ్ల: మొండ్రాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బేతి సోమయ్య, కునుకు ఉప్పలయ్యలు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్‌రావు సోమవారం వారి ఇళ్లకు వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు సింధ రామోజీ, నాయకులు డి.వెంకటేశ్వర్‌రావు, తుకారాం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, మిడ్డే మీల్స్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం సదుపాయం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్య, స్నేహ, కరణ్, హరీశ్, వైష్ణవి, కావ్య పాల్గొన్నారు.

రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

- డీసీపీ రాజమహేంద్ర నాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. మార్కెట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. రైతుల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సీఐ దామోదర్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

జీడికల్ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ

లింగాలఘణపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండ లంలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల క్షేత్రంలో గురువారం కార్తీక మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ, జనగామ ఉప్పలమ్మ దేవస్థానం ఈవో కెకె రాములు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వేదబ్రాహ్మణులు భార్గవాచార్యులు నేతృత్వంలో ఉత్స వమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి లక్ష్మీపూజ చేశారు. అనంతరం కొండపై నున్న జీడిగుండం, పాలగుండంలో శుక్రవారం వేకువజామునే మొదలయ్యే భక్తు ల కార్తీక పుష్కరణి పుణ్యస్నానాల కోసం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లేశం, కొండబోయిన భరత్‌కమార్, ఏలె మూర్తి తదితరులు పాల్గొన్నారు.



జీడికల్ కార్తీకమాస బ్రహ్మోత్సవ ప్రారంభ పూజలు జరుపుతున్న అర్చకులు

పీడీఎస్ బియ్యం పట్టివేత




ధరావత్ రాజేష్ వద్ద పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

దేవరుప్పుల, నవంబరు 14 (ఆంధ్రజ్యో తి): మండలంలోని ధరావత్‌తండాలో ధరావత్ రమేష్ తన ఇంటి ఆవరణలో నిల్వ ఉంచిన ఐదు కింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం దేవరుప్పుల పోలీసులు పట్టుకున్నారు. రాజేష్‌పై కేసు నమో దు చేసినట్టు ఎస్సై సృజ న్‌కుమార్ తెలి పారు. కార్యక్రమంలో ఏఎస్సై సదానందం, కానిస్టేబుల్ యాకేష్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు నివాళి
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

8లో



లింగాలఘణపురం కేజీబీవీలో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

న్యూస్ రీల్

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

రఘునాథపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం జరిగిన సీపీఎం మండల మహాసభకు మైలారం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, కనకారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం మండల కార్యదర్శిగా గంగాపురం మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పొదల నాగరాజు, కడారి ఐలయ్య, మంచాల మల్లేష్, కాసాని పుల్లయ్య, యాదగిరి, లవకుమార్, వెంకటస్వామి, బీమగోని చంద్రయ్య, గొలనుకొండ చక్రపాణి, సత్తిరెడ్డి, వారాల రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిడి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం కొత్తపల్లి జరిగిన బీజేపీ మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపే బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్, గంటె ఉపేందర్‌యాదవ్, రాజేష్ రెడ్డి, కందిమల్ల కృష్ణమూర్తి, ఆకుల నవీన్‌గౌడ్, శ్రీనివాస్, రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్, అధికారులపై దాడిన చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల జేఏసీ గురువారం కలెక్టరేట్ ఎదుట భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఖాజా షరీఫ్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కొర్నెలియస్, చంద్రశేఖర్‌రావు, మహిపాల్‌రెడ్డి, వెంకన్న, పెండెల శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, రాజనర్సయ్య, స్టెల్లా పాల్గొన్నారు.



నర్మెటలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం

ఆ ఉపాధ్యాయుడిని డిస్మిస్ చేయాలి

నర్మెట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నర్మెట మోడల్ స్కూల్‌లో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని డిస్మిస్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. గురువారం మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో జరిగిన సంఘటనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కృష్ణ, అఖిల, తరుణ్, వీరన్న, రిషి, దీప్తి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.



కూనూరులో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొనసాగుతున్న సర్వే ప్రక్రియ

జఫర్‌గడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలో కొనసాగుతున్న కుటుంబ సర్వేను గురువారం జఫర్‌గడ్ ఎంపీడీవో సుమన్ రఘునాథ్‌పల్లి, కూనూరు, తిడుగు గ్రామాల్లో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

ఘనంగా బాలల దినోత్సవం



సెయింట్ పాల్స్ స్కూల్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంఈవో



బాలయేసు హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న డీఈవో రాము



ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు

జనగామ కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జనగామలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో చిన్నారులు వేషధారణ ఆకట్టుకుంది. 1 నుంచి 4వ తరగతి విద్యార్థుల స్టాల్స్ ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.మరియ జోసెఫ్, ఎంఈవో వంగాల రాజేందర్ పాల్గొన్నారు. అలాగే ఏకశిల పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కార్యదర్శి సి. ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అరబిందో పాఠశాలలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

- జనగామ రూరల్: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో వంగాల కల్యాణి మల్లారెడ్డి, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, గాదె పాక రాంచందర్, లక్ష్మీనారాయణ, దుర్గేశ్, బొట్ల నర సింహరావు పాల్గొన్నారు.
- దేవరుప్పుల: విద్యార్థులు బాగా చదివి మంచి ర్యాంకులు సాధించాలని డీఈవో కె.రాము అన్నారు. మండలకేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో డీఈవో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, మహేష్, మాధవి, అనిత, పాషా, విజయలక్ష్మీ, ఎన్‌సీసీ మాస్టర్ కృష్ణ పాల్గొన్నారు.
- నర్మెట: మండలంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మాన్‌సింగ్‌తండా పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కోమల్ల పాఠశాలలో చిన్నారుల వేషధారణలు

- బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, నల్లగోని బాలకిషన్ గౌడ్, గుర్రపు బాల్‌రాజు, ఆముదాల మల్లారెడ్డి, గిద్దెల రమేష్, నారాయణరెడ్డి, మహేందర్, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.
- లింగాలఘణపురం: బండ్లగూడెంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌వో అన్నపూర్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, హెచ్ఎంలు మల్లికార్జున్, సత్యనారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో నెహ్రూ చిత్రపటాలకు నివాళులర్పించారు. స్థానిక బాలికల, బాలుర హైస్కూళ్లు, సెయింట్ థామస్, సెయింట్ మేరీస్ హైస్కూళ్లలో, పలు పీఎస్, యూపీఎస్ పాఠశాలలో ప్రైమరీ విద్యార్థుల పాటలు, ఉపన్యాస, నృత్య, చిత్రలేఖన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు సంపత్, కె.రమేశ్, సదామోహన్, శ్రీధర్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.
- రఘునాథపల్లి: కోమల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్ఎం జాన్ సుందర్ రావు, ఉపాధ్యాయులు సురేష్, సంతోష్ రెడ్డి, పుష్ప పాల్గొన్నారు. కంచనపల్లిలో వేడుకల్లో రాపోలు రామ్మూర్తి, కారంపూడి వెంకటనర్సు, మల్లేష్, సామేల్, ఎల్లయ్య, భిక్షపతి పాల్గొన్నారు.
- జనగామ రూరల్: బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పోరిక అను జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. జనగామ, హన్మకొండ డీటీడీవో ప్రేమకళ, జనగామ జైలర్ పోరిక కృష్ణకాంత్, హెచ్ఎం జె.లచ్చిరాం, బి.వాసు. రతన్‌సింగ్, జయరాం, సరోజ పాల్గొన్నారు.
- తరిగొప్పుల: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బానోతు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరం

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలపై దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు సుంచు విజేందర్, భూక్యా చందు నాయక్ అన్నారు. గురువారం జనగామలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరిని నిరసిస్తూ 19, 20 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 26న కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి అహల్య, అజ్మీరా సురేష్, మీట్యా నాయక్, ఉపేందర్, రాజు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు



పాఠశాలకు కొనుగోలు చేసిన సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

స్కూల్‌కు దాతల సహకారం

బచ్చన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు ముందుకు రావటం అభినందనీయమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం నారాయణపూర్ ఉన్నత పాఠశాలకు దాతలు వివిధ సామగ్రి కొనుగోలుకు విరాళాలు అందించారు. సామాల సందీప్ రెడ్డి రూ.20వేలు, అవనగంటి నవీన్‌కుమార్ రూ.20 వేలు, మాసపేట అంజన్‌రెడ్డి రూ.10వేలు, దొంతిరి నర్సింహ్మారెడ్డి రూ.20వేలు, కల్లూరి నవీన్‌రెడ్డి రూ.10వేలు, అర్కాల తిరుపతిరెడ్డి రూ.5వేల విలువ గల విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేసి ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, శశిధర్‌రాజు, జీవన్ కుమారి, ఆదేశ్‌లు 45 మంది విద్యార్థులకు రూ. 20 వేల విలువ చేసే ట్రాక్ సూట్‌లు కొనుగోలు చేసి ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రెడ్డి, హెచ్ఎం ఇంద్రసేనారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికసిత భారత్ మోదీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

కొడకండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ ప్రధానమంత్రి మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి దొంగరి మహేందర్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం మండలపార్టీ అధ్యక్షుడు పి.ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సంస్థాగత పర్వం- కార్యశాల కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతీ కార్యకర్త కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అధికంగా బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.కోటేశ్వర్, ఎం.సోమన్న ఆంజనేయులు, శ్రీనివాస్, ఉపేందర్, పరమేశ్ పాల్గొన్నారు.

కేజీకేఎస్ మండలాధ్యక్షుడిగా రఘురాములు



స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) మండలాధ్యక్షుడిగా మాచర్ల రఘురాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో కేజీకేఎస్ మండల నూతన కమిటీని కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్యగౌడ్, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గట్టు రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పొన్నం రంజిత్‌గౌడ్, మాచర్ల భిక్షపతి, మందపురం అంజయ్య, వంగ వేణు, ప్రధానకార్యదర్శిగా పులి శ్రీనివాస్, కార్యదర్శిగా కత్తి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా బత్తిని రాజుగౌడ్, కార్యవర్గ సభ్యులుగా పులి స్వామి, గట్టు చిన్నకుమార్, వడ్లకొండ నర్సయ్య, వీరగోని నారాయణ, పల్లె లక్ష్మీనారాయణ, నరేష్‌లను ఎన్నుకున్నారు.

అధికారులపై ప్రయాణికుల ఆగ్రహం

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంత్రం ఆర్టీసీ అధికారుల తీరు, సిబ్బందిపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, జగద్గిరిగుట్ట, హన్మకొండ వెళ్లే బస్సు సర్వీసులను ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులు దిగే వద్ద నిలపడంతో అక్కడే తిరిగి ఫుల్ అయి పాయింట్ మీదికి రాకుండానే వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు తాము వెళ్లాల్సిన బస్సులను మిస్ అవుతున్నారు. బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులను అడగగా సరైన సమాధానం ఇవ్వకపోగా దురుసుగా ప్రవర్తించడంతో ప్రయాణికులు గొడవకు దిగారు. బస్సులను తప్పనిసరిగా పాయింట్ వద్ద నిలపాలని డిమాండ్ చేశారు.

ప్రధానంగా తొర్రూరు బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు తీవ్రమైన రద్దీ ఉంటుం ది. దీంతో ఆర్టీసీ అధికారులు పూర్తిస్థాయిలో బస్సులు నడపలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. బస్సులు పాయింట్‌ల వద్దకు వచ్చిన తర్వాతే పంపాలని ప్రయాణికులు కోరుతున్నా డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు.

దీనిపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా హైదరాబాద్ రూట్‌లో రద్దీ ఉంటుందని, బస్సులను నడుపుతున్నామన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. నర్సింహులపేట మండలం పడమటిగూడెం సమీపంలోని ఖమ్మం- వరంగల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ కంపెనీలో గురువారం సందర్శించి సీసీఐ పత్తి కొనుగోళ్లను పరిశీలించారు.

రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చే రైతులు తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేటట్లు చూసుకుంటే మంచి మద్దతు ధర లభిస్తుందన్నారు. పత్తి రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో వసూళ్లకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మార్కెట్ కార్యదర్శి నిరంజన్, డీఈవో వెంకన్న, మార్కెట్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

న్యూస్ కార్నర్

ఎస్ఎస్‌సీ పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత సాధించాలి

జనగామ కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్షల్లో విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించాలని జనగామ ఎంఈవో వంగాల రాజేందర్ కోరారు. గురువారం జనగామ మండలం గానుగుపహాడ్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువగా 10జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో నర్సింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సాక్షిత



పాలకుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముత్తారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాక్షిత అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి గురువారం తెలిపారు. ఇటీవల హన్మకొండ జేఎన్ఎస్‌లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో సాక్షిత పాల్గొననుందని హెచ్ఎం తెలిపారు.

సీసీ రోడ్డు పనులు షురూ



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

జఫర్‌గడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తీగారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి పథకం కింద రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి.

ఈ పనులను గురువారం మాజీ ఉపసర్పంచ్ కలకోట అనిల్‌కుమార్, జిట్టబోయిన గోపాల్ అధికారు లు, గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు గోనె యాదగిరి, సంపత్, కడారి భిక్షపతి, సింగపురం అశోక్, కలకోట స్వామి, సముద్రాల కుమార స్వామి, రాఘవులు, గట్టుమల్లు, తౌటి శంకరయ్య, అన్నారెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో రేవంత్ సర్కార్ వైఫల్యం

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సంస్థాగత వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు పర్చలేదని, హామీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గుర్తి చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతంగా పూర్తవుతుందని, ప్రజాస్వామ్య బద్ధంగా పార్టీ రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కార్యకర్తలు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. ఈనెలాఖరులోగా బూత్ కమిటీలు పూర్తిచేసి మండల, జిల్లా అధ్యక్ష పదవులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూసల శ్రీమాన్, పల్లె కుమార్, రంగురాములు, రచ్చ కుమార్, కాగు నవీన్, శేఖర్, విష్ణువర్ధన్, చలపతి తదితరులు ఉన్నారు.

వినతులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఆందోళన.. కలెక్టర్ వినతిపత్రం

జనగామ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు రూ.18వేల వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, యాక్సిడెంట్‌లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాడగోని రాధ, సీహెచ్.రమ, విజయ, శోభ, శారద, సువార్త, పద్మావతి పాల్గొన్నారు.

పత్తిని కొనుగోలు చేయాలి..

జనగామ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీసీఐ అధికా రులు పత్తిని కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు చిర్రా వీరస్వామి, పండుగ హరీశ్‌లు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలను మార్కెట్‌కు తీసుకొస్తే తేమ పేరుతో కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్ట పోతున్నారన్నారు. కార్యక్రమంలో బోళ్ల రాజుకుమార్, పిట్టల రజనీకాంత్, సాంబరాజు, మారబోయిన శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు